సాక్షి బాపట్ల

ఆదివారం । 30 । జూలై । 2023



బోట్ల రాకపోకలు బంద్

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారీగా వస్తున్న వరద నీరు కారణంగా ఏపీటీడీసీకి చెందిన బోట్లను హరిత బరంపార్క్‌లో గల బోటింగ్ పాయింట్ వద్ద ఆపేశారు.



పులిచింతల ప్రాజెక్టు నీటి నిల్వ

అచ్చంపేట: ఎగువ ప్రాంతాలనుంచి వర్షపు నీరు వచ్చి చేరుతుండటంతో పులిచింతల ప్రాజెక్టులో నీటినిల్వ శనివారం సాయంత్రానికి 30.70 టీఎంసీలకు చేరింది.

అమరేశ్వరుని సేవలో



అమరావతి: బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామిని శనివారం రాజస్థాన్ హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంభజీ శివాజీ షిండే దర్శించుకుని, పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

శిశు విహార్‌కు శిశువు తరలింపు



గుంటూరు మెడికల్: వారం రోజుల క్రితం వినుకొండ బస్టాండ్ బాత్‌రూములో వదిలి వెళ్లిన శిశువును కొందరు గుర్తించి, జీజీహెచ్‌కు తీసుకు రాగా పిల్లల వైద్య విభాగంలో చికిత్స అందించామని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. మహిళ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది శిశువును పరీక్షించి, ఆరోగ్యం నిలకడగా ఉండటంతో శిశు విహార్‌కు శనివారం పంపించామని వెల్లడించారు. పిల్లల వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రమేష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీఓ రాష్ట్ర సభల పోస్టర్ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: ఏపీ ఎన్జీఓ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 21, 22 తేదీల్లో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతాయని ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు తెలిపారు. శనివారం గుంటూరులోని ఏపీ ఎన్జీఓ హోమ్‌లో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర మహాసభలకు విచ్చేస్తున్నారని, ఉద్యోగులంతా భారీగా తరలిరావాలని కోరారు. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ బైలాకు సంబంధించి కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.జవహర్‌రెడ్డి సభలకు విచ్చేస్తున్నారని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి వసతి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. అసోసియేషన్ జిల్లా సెక్రటరీ శెట్టిపల్లి సతీష్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటరెడ్డి, ఎస్.రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి సుకుమార్, గుంటూరు నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్.సూరి, కార్యదర్శి సి.హెచ్.కళ్యాణ్‌కుమార్, నాగేశ్వరరావు, అనిల్‌కుమార్, శేషగిరిరాజు, రాధారాణి, అంజలి, జయలక్ష్మి పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలి



పట్నంబజారు: ప్రపంచ వ్యాప్తంగా పులులు తగ్గినప్పటికీ భారతదేశంలో 70 శాతం ఉన్నాయని, జీవ వైవిధ్యం కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణాజిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి చెప్పారు. శనివారం బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పర్యావరణ విద్యాపరిషత్ రూపొందించిన అంతర్జాతీయ పులుల దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ వాతావరణ మార్పులు, అటవీ విస్తీర్ణం తగ్గడం, మానవ కార్యకలాపాల వల్లే పులుల సంఖ్య తగ్గిందన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ పులుల సంరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి అందరూ సహకరించాలన్నారు. అంతరించిపోతున్న జీవజాతులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యావరణ విద్యాపరిషత్ సభ్యులు డి.తిరుపతిరెడ్డి, శాంతమూర్తి, కబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువగళంపై విమర్శల గళం

లోకేశ్ ఈవినింగ్ వాక్ భల్లే..భల్లే
- రాత్రుల్లో చినబాబు యాత్ర
- ప్రజలతో మమేకం ఒట్టిమాట
- జనం ఇళ్లకు చేరిన తరువాత యాత్ర
- నవ్వి‌పోతున్న జనం
- రాత్రిపూట యాత్రపై సొంతపార్టీ నుంచే విమర్శలు
- హంగు ఆర్భాటాలకే అధిక ప్రాధాన్యం



అద్దంకి నియోజకవర్గంలో సాగుతున్న యువగళం యాత్ర

సాక్షి ప్రతినిధి,బాపట్ల: చినబాబు లోకేశ్ యువగళం యాత్రను ఈవినింగ్ వాక్‌గా మార్చడంపై విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఏర్పాటు చేసుకున్న టెంట్ లోనే గడుపుతున్న లోకేశ్ సాయంత్రం ప్రొద్దుగూకే సమయానికి యువగళం యాత్రను మొదలు పెడుతున్నాడు. చినబాబు అన్నీ సర్దుకొని నడక మొదలు పెట్టేసరికే చీకటి పడుతుంది.. ఆతరువాత జనానికి ఏమాత్రం కనిపించకుండా కార్యకర్తల హడావుడి, ఆర్భాటాల నడుమ కాసేపు నడకసాగించి యాత్రను మమ అనిపిస్తున్నాడు. ప్రజలతో మమేకమై, వారి సమస్యలు విని, వాటిని ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకే యువగళం యాత్ర చేపట్టినట్లు లోకేశ్ ప్రకటించారు. యాత్ర ప్రారంభమయ్యాక అధికారంలోకి వచ్చేది తామేనని, వచ్చాక అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఊదరగొట్టిన చినబాబు అన్నివర్గాలతో సమావేశం అవుతున్నట్లు, వారిమాటలు వింటున్నట్లు నానాహంగామా చేస్తున్నాడు. వాస్తవానికి లోకేశ్ తన యాత్రలో ప్రజలను కలుస్తున్నది నామమాత్రంగా కూడా కనిపించడంలేదు.

ఉదాహరణకు శనివారం ప్రకాశం జిల్లానుంచి యువగళం యాత్ర అద్దంకి నియోజకవర్గంలోని మేదరమెట్ల వద్ద బాపట్ల జిల్లాలోకి ప్రవేశించింది. సాయంత్రం 5 గంటలకు లోకేశ్ యాత్రను మొదలు పెట్టారు. సరిహద్దుకు వచ్చేలోపు చీకటి పడింది. అక్కడినుంచి క్యాంపునకు చేరుకొనేసరికి రాత్రి 9గంటలు దాటింది. ఈ మధ్యలో రైతులతో ముఖాముఖి అన్నారు, ఎస్సీలతో మాటామంతీ అన్నారు. ఇలా చాలామందితో చర్చిస్తారన్నారు. కానీ శనివారం అలాంటి సమావేశాలు ఏవీ జరగలేదు.

పగటిపూట యాత్రచేస్తే రోడ్డువెంబడి జనం ఉంటారు, రైతులు ఉంటారు, కార్మికులు కనిపిస్తారు, రైతు కూలీలు కంటబడతారు. వారితో మాట్లాడవచ్చు. నిజంగా కష్టాలు ఉండి వారు చెబితే వినవచ్చు. ప్రతిపక్షనాయకుడిగా ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇదే చేశారు. అందరి కష్టాలు విన్నారు, కన్నీళ్లు తుడిచారు. నేనున్నానని భరోసా ఇచ్చారు.. అధికారంలోకి రాగానే అందరికీ అడగకుండానే అన్నీ ఇచ్చారు. కానీ చినబాబు జనం ఇళ్లకు చేరాక, పశుపక్ష్యాదులు గూళ్లకు చేరాక యువగళం పేరుతో చీకటియాత్ర నిర్వహిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అడపా దడపా ఎంపిక చేసుకున్న కొందరు కార్యకర్తలను పోగేసి చర్చావేదికలంటూ యాంకర్లను పెట్టుకొని మరీ ఫోజులు ఇవ్వడంపైనా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. లోకేశ్ యువగళాన్ని ఈవినింగ్ వాక్‌గా ఎందుకు మార్చారో అంతుబట్టడంలేదని టీడీపీ నాయకులు, కార్యకర్తలే పేర్కొనటం గమనార్హం. ఆరోగ్యాన్ని కాపాడుకొనేందుకు యాత్ర చేస్తున్నట్లుంది కానీ ప్రజలను పలకరించడానికి, వారి సమస్యలను వినడానికి యాత్ర చేపట్టినట్లు లేదని ఆ పార్టీకి చెందిన ఓ నేత బాహాటంకంగా వ్యాఖ్యానించారు.

యువగళం ఆర్భాటం...

అద్దంకి నియోజకవర్గంలో జరిగిన యువగళం శనివారం హంగు, ఆర్భాటాలతో సాగింది. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో మేదరమెట్ల మండలంలోని తిమ్మనపాలెం వద్ద మొదలైన యాత్ర మేదరమెట్ల, బడ్డువానిపాలెం వరకు సాగి 9 గంటల ప్రాంతంలో ముగిసింది. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బలప్రదర్శనకు యువగళం వేదికగా మారింది. జనం సంగతి, సమస్యల సంగతి దేవుడెరుగు పచ్చపార్టీ సామాన్య కార్యకర్తలు లోకేశ్‌ను కలిసే పరిస్థితి కనిపించలేదు. సభ ఆద్యంతం ఒకటే హడావుడి. లోకేశ్ యాత్ర ఈ తరహా జనసేకరణ, ఆర్భాటాలతోనే సాగుతోంది. దారంతా ఫ్లెక్సీలతో నింపాలి. వేలాదిగా జనాన్ని తరలించాలి. డీజేలతో చెవులు దద్దరిల్లాలి, పాటలతో మారుమోగాలి, అడుగడుగునా పచ్చ పేపర్లు వెదజల్లే యంత్రపరికరం, గజమాలలు వేసే వాహనానికి రంగురంగుల లైటింగ్ వెదజల్లే యంత్రం, ఫొటోలకూ కలరింగ్ ఇచ్చేయంత్రాలు, దారంతా డప్పులు, అబ్బో ..ఒకటికాదు, రెండు కాదు ఆర్భాటం అంతా ఇంతాకాదు. దీంతో లోకేశ్ యువగళంపై విమర్శల గళం వినిపిస్తోంది. అసలు ఈ యాత్ర ఎందుకు జరుగుతున్నట్లు అన్న ప్రశ్న స్వపక్షం నుంచే వినిపించడం విశేషం. ఈ కార్యక్రమంలో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కరువు 'పని' పట్టారు!

పేదల బతుకులు గాడిలో పడుతున్నాయి.. స్థానికంగానే ఉపాధి దొరుకుతోంది. ఒకప్పుడు ఈ ప్రాంత పేదలకు వలసలే ఆధారం. ఖరీఫ్ సీజన్ వస్తే చాలు.. వేకువనే చద్దన్నం మూటగట్టుకుని, చంటి బిడ్డలను చంకనేసుకుని పని బాట పట్టేవారు.. కూలీ'బండి' కోసం కోడి కోతకు ముందే చేరుకునే వారు.. చీరాల, బాపట్ల స్టేషన్లు కూలీలతో నిండిపోయేవి.. చీరాల– విజయవాడ మార్గంలో ఆగిన ప్రతి ఊరిలో కొంతమంది నాట్ల కోసం దిగేవారు.. ఖరీఫ్ ముగిసిన తరువాత కొందరు పల్లెలు ఖాళీలో పనులు వెతుకుంటూ వలసలు వెళ్లేవారు... ప్రస్తుతం రోజులు మారాయి.. ఉపాధి పథకం పేదలను ఆదుకుంటోంది.. అధికారులతో కలిసి కూలీలు కరువు పని పట్టి.. జిల్లాలో దాని జాడ లేకుండా పారదోలుతున్నారు. ఉపాధి పథకంలో బాపట్ల జిల్లా రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచింది...

జిల్లాలో జోరుగా 'ఉపాధి' పనులు
- ఈ ఆర్థిసంవత్సరం లక్ష్యం 73 లక్షల పని దినాలు
- గడచిన నాలుగునెలల్లోనే 64 లక్షల పని దినాలు కల్పించిన వైనం
- 1.63 లక్షల కుటుంబాలకు పని
- ఇప్పటివరకు రూ.197.57 కోట్లు ఖర్చు
- రాష్ట్రంలో జిల్లాకు 5వ స్థానం



జిల్లాలో జోరుగా సాగుతున్న ఉపాధిహామీ పనులు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: జిల్లాలో 'ఉపాధి' పరుగులు పెడుతోంది. ప్రభుత్వ ఆదేశాలతో ఇక్కడి అధికారులు అన్నివర్గాల పేదలకు స్థానికంగానే పనులు కల్పిస్తున్నారు. పైగా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పనులు కల్పిస్తున్నారు. సీజన్లతో పని లేకుండా ప్రతి వేతనదారుడికి 75 రోజులకు తగ్గకుండా పని కల్పించాలన్నది లక్ష్యం. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 73 లక్షల పనిదినాలు కల్పించడం లక్ష్యంకాగా గడచిన నాలుగు నెలల కాలంలో 64 లక్షల(86.48 శాతం) పని దినాలు కల్పించారు. ఇక రాబోవు ఎనిమిది నెలల కాలంలో 13.52 శాతం పనిదినాలు మాత్రమే కల్పించాల్సివుంది. జిల్లాలో 1.63 లక్షల కుటుంబాల పరిధిలో 2.82 లక్షలమంది వేతనదారులు ఉన్నారు. ఇందులో ఎస్సీలకు 35.97 శాతం, ఎస్టీలకు 3.42 శాతం పనులు కల్పించగా మహిళలకు 53.74 శాతం, దివ్యాంగులు 2,064 మందికి పనులు కల్పించారు.

రూ.197.57 కోట్లు ఖర్చు..

ఇప్పటివరకూ ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనులకోసం రూ 197.57 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇందులో వేతనదారులకు రూ.156.17 కోట్లు, మెటీరియల్‌కు రూ.38 12 కోట్లు ఖర్చుచేశారు. సగటున నూరు రోజులు పనులు కల్పించాల్సిఉండగా ఇప్పటివరకు 5,084 కుటుంబాలు నూరురోజుల పనిదినాలు పూర్తి చేసుకున్నాయి. మిగిలిన కుటుంబాలు 40 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్నాయి. ఒక్కొక్కరికి సగటున రూ.244.53 కూలీకింద చెల్లించారు.

పారదర్శకంగా పనులు..

ఉపాధి పనులను జిల్లా అధికారులు పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. పనులు జరిగే సమయంలో కూలీల హాజరును నేషనల్ మొబైల్‌మానిటరింగ్ సిస్టం ద్వారా అటెండెన్స్, ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. పనులను కిందిస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మాస్టర్ వెరిఫికేషన్ చేస్తున్నారు. ర్యాండమ్ చెక్ చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ మాస్టర్ మెజర్‌మెంట్ సిస్టం, క్వాలిటీ కంట్రోల్ వింగ్ ర్యాండమ్ గా పనులు చెక్ చేస్తున్నారు. ఇక వేతనదారులకు సంబంధించి ఆధార్‌ను అనుసంధానం చేసిన బ్యాంక్ అకౌంట్, పోస్టాఫీసు అకౌంట్‌కు వేతనాన్ని జమచేస్తున్నారు. సామాజిక తనిఖీలు క్రమంతప్పకుండా నిర్వహిస్తున్నారు. ఎటువంటి అక్రమాలకు తావులేకుండా పనులు పారదర్శకంగా నిర్వహిస్తున్నారు.

పనులు ఇలా..

నీటి సంరక్షణ పనులకు అధిక ప్రాధాన్యత నిస్తున్నారు. వర్షంనీటిని వడిసిపట్టే పనులైన చెరువులు, కుంటల్లో పూడికతీత, ఫాంపాండ్స్, ట్రించెస్ ఇతర నీటినిలువ పనులతోపాటు మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత నిస్తున్నారు. ఇందులో భాగంగా పండ్లతోటల పెంపకం పనులు చేపడుతున్నారు. ఉద్యానవన విభాగం పరిధిలో ఆర్థిక సంవత్సరంలో 500 ఎకరాల్లో పండ్లతోటల పెంపకం పనులు చేపడుతున్నారు. గుంతలు తీయడం, మొక్కలు నాటడం, ఎరువులు వేయడం తదితర పనులను ఉపాధిహామీ ద్వారా చేపడుతున్నారు. మూడు సంవత్సరాల పాటు పనులకు ప్రభుత్వం ఎకరాకు రూ1.35 లక్షలు చెల్లిస్తుంది.


వలసల నివారణే లక్ష్యం..

జిల్లానుంచి ఎవరూ ఇతరప్రాంతాలకు పనుల కోసం వలస వెళ్లకూడదన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఇందుకోసం సీజన్లవారీ పనులు చేపడుతున్నారు. వర్షాకాలంలో ఉపాధిహామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేశారు. ఇందులో భాగంగా గుంతలు తీయడం, మొక్కలు నాటడం, ఎరువులు వేయడం తదితర పనులు కల్పిస్తున్నారు. ఏఒక్క వేతనదారుడు పనుల కోసం వలస వెళ్లకూడదని, పనులు దొరక్కపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకవస్తే వారికి స్థానికంగానే పనులు కల్పిస్తామని జిల్లా అధికారులు చెబుతున్నారు.

రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్...

మిద్దెలమీద పడిన నీటిని పైపులద్వారా తెచ్చి అందుబాటులోఉన్న బోర్లు లేదా ఇతర నీటి వనరులవద్ద 12 అడుగుల గుంత తీసి ఫిల్టర్ బెడ్ ఏర్పాటుచేసి అక్కడకు నీటిని రీచార్జ్ చేసి భూగర్భ జలాలు పెంచేందుకు ప్రభుత్వం రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్‌ను ఏర్పాటు చేస్తోంది. తొలుత జిల్లాలోని 150 ప్రభుత్వ కార్యాలయాలవద్ద వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ప్రణాళిక సిద్ధం చేశారు. త్వరలో పనులు మొదలు పెట్టనున్నారు.

వేతనదారులందరికీ స్థానికంగా పనులు



జిల్లాలో ఉపాధిహామీ పనులు పెద్దఎత్తున చేపడుతున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో 73 లక్షల పనిదినాలు కల్పించాల్సిఉండగా ఇప్పటివరకు 64 లక్షల పనిదినాలు కల్పించాం. మిగిలిన ఎనిమిది నెలల కాలంలో మరింతగా పనులు కల్పించాలన్నది లక్ష్యం. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు పనులు కల్పిస్తున్నాం. ఏఒక్కరూ పనులు లేవని జిల్లానుంచి వలస వెళ్లకూడదన్నది లక్ష్యం. సీజన్లతో పనిలేకుండా జిల్లాలో అన్నివర్గాలవారికి పనులు కల్పిస్తాం. ఇప్పటివరకూ రూ.197.57 కోట్లు ఖర్చుచేశాం.

– శంకర్‌నాయక్, డ్వామా పీడీ, బాపట్ల జిల్లా

వీడిన న్యాయవాది మిస్సింగ్ మిస్టరీ

- రాజీకి పిలిచి హత్య చేసి పూడ్చిపెట్టిన నిందితుడు!
- ఫోరెన్సిక్ కమిటీ సమక్షంలో మృతదేహం వెలికితీత



మృతదేహాన్ని వెలికి తీయిస్తున్న పోలీసులు

అద్దంకి: ఎట్టకేలకు న్యాయవాది మిస్సింగ్ కేసు మిస్టరీ వీడింది. మృతుడి కుమారుడు తెలిపిన వివరాల మేరకు.. బల్లికురవ మండలం కొణిదెన గ్రామానికి చెందిన న్యాయవాది ఆదిశేషు విఠల్‌బాబు (65) ఈనెల 26న పొలం విషయంలో అద్దంకి కోర్టులో హాజరయ్యాడు. అప్పటినుంచి అతని జాడ లేకుండా పోయింది. దీనిపై విఠల్‌బాబు కుమారుడు రామకృష్ణ అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుతో మృతుడి సెల్ ఫోన్‌కోసం వెతికిన పోలీసులు, సిగ్నల్ ట్రాక్ చేయడంతో ఆ ఫోన్ నిందితుడి వద్ద ఉందని తెలుసుకున్నారు. దీనిపై పోలీసులు తమదైన శైలిలో విచారించగా తానే న్యాయవాది విఠల్‌బాబును హత్య చేసి అద్దంకి–శంఖవరప్పాడు రహదారి నుంచి బొమ్మనంపాడు వెళ్లే డొంక పక్కనే ఉన్న పొలంలో పూడ్చి పెట్టినట్లు నిందితుడు ఒప్పుకొన్నాడు. కేసు వాయిదాకు వెళ్లిన విఠల్‌బాబును నిందితుడు రాజీకి మాట్లాడుకుందాం రమ్మని పిలిచాడు. నమ్మకంగా బండిపై ఎక్కించుకుని వెళ్లి హత్య చేసి సుబాబుల్ చేలో గొయ్యి తీసి పూడ్చిపెట్టాడు. ఏమీ ఎరగనట్టు అతని ఫోన్‌ను తన జేబులో వేసుకుని ఇంటికి వెళ్లినట్లు నిందితుడు పోలీసుల వద్ద ఒప్పుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో నిందితుడు చెప్పిన చోటులో శనివారం పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో తవ్వగా మూడు అడుగుల లోతులో న్యాయవాది మృతదేహం లభించింది. దీంతో ఇప్పటి వరకూ కొనసాగిన మిస్టరీ వీడినట్లయింది. శనివారం రెవెన్యూ అధికారులు, పోలీసులు సీఐ ఉమేష్, ఎస్ఐ ఆదిలక్ష్మి మృతదేహానికి పంచనామా నిర్వహించారు.

గొయ్యి తీసి పూడ్చి.. అనుమానం రాకుండా చదును చేసి..

న్యాయవాది విఠల్‌బాబును హత్య చేసిన నిందితుడు బొమ్మనంపాడు గ్రామానికి వెళ్లే డొంకకు పక్కనే ఉన్న సుబాబుల్ తోటలో మూడు అడుగుల లోతు గొయ్యి తీశాడు. అందులో మృతదేహాన్ని పూడ్చిపెట్టి, పైకి మట్టి ఎత్తుగా కనిపించకుండా చదునుగా చేసి, దానిపై సుబాబుల్ కర్రలు పడేశాడు. అంటే ఎవరికీ అక్కడ గొయ్యి కనపడకుండా తెలియకుండా చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 515.30 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకి 4,848, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి వచ్చే నీటిచేరిక నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 836.00 అడుగుల వద్ద ఉంది. జూరాల నుంచి శ్రీశైలం జలాశయానికి 1,80,835, రోజా 2,181 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

క్లుప్తంగా

గర్భిణులు, పిల్లలకు టీకాలు

వచ్చేనెల నుంచి మిషన్ ఇంద్రధనస్సు

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం ఆగస్టు నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి జి.శోభారాణి తెలిపారు. పల్నాడు రోడ్డులోని తన కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. ప్రతి గ్రామంలోని ఆశ కార్యకర్తలు ఇంటింటి సర్వే ద్వారా వ్యాధి నిరోధక టీకాలు పొందని, మధ్యలో ఆపేసిన గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించారన్నారు. జిల్లాలో 54 మంది గర్భిణులు, 776 మంది ఐదేళ్లలోపు పిల్లలు ఉన్నారన్నారు. వీరందరికీ ఆగస్టు ఏడో తేదీ నుంచి 12వ వరకు ప్రత్యేకమైన 346 వ్యాధి నిరోధక సెషన్లు, 327 మంది ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తల ద్వారా టీకాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం వచ్చే సెప్టెంబర్ 11 నుంచి 16వరకు, అక్టోబర్ 9 నుంచి 14 వరకు నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా సంచార జాతులు, కర్మాగారాల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్ర పనివారు, వలస కూలీలు, పట్టణ మురికివాడలలో నివసిస్తున్న వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందన్నారు. కావున అందరూ ఈ విషయాలను గుర్తించి తమ బిడ్డలకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించి తద్వారా వారిని ప్రాణాంతక వ్యాధుల నుండి కాపాడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వివరాల కోసం మీ ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య అధికారి (ఎంఎల్‌హెచ్‌పి), ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలను సంప్రదించాలని కోరారు.

రోడ్డుపై యువకుల ఘర్షణ

- కుందేరు రోడ్డులో గ్రూపులుగా చేరి..
- వేటపాలెంలో మత్తుకు బానిసలైన యువకులు బరితెగింపు

వేటపాలెం: మత్తుకు బానిసలై కొందరు యువకులు ఘర్షణకు దిగారు. స్థానిక కుందేరు రోడ్డులోని జెండా చెట్టు దగ్గరలో రెండు వర్గాలకు చెందిన యువకులు శుక్రవారం రాత్రి ఘర్షణకు దిగారు. ఇరు వర్గాలకు చెందిన యువకులు నడిరోడ్డుపై స్ట్రీట్‌ఫైట్‌కు దిగారు. మత్తుకు బానిసైన ఇద్దరు యువకులు మరో వర్గానికి చెందిన ఇద్దరు యువకులతో ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణ సమయంలో మరో వర్గానికి చెందిన దాదాపు 20 మంది యువకులు వచ్చి ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సురేష్ ఘర్షణ పడిన యువకులను పోలీసు స్టేషన్‌కి పిలించి కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు. ఇటువంటివి గ్రామంలో నిత్యకృత్యంగా


రోడ్డుపై ఘర్షణ పడుతున్న యువకులు

మారాయి. ఇటీవల యువకులు క్రికెట్‌లో బెట్టింగ్ విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో వేటపాలెం సెంటర్‌లో యువకులు పరస్పరం దాడి చేసుకున్నారు. అప్పట్లో పోలీసులు ఇరువర్గాలను యువకులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అయినప్పటికీ యవకులు నడిరోడ్లలో ఘర్షణలకు దిగడం పరిపాటిగా మరిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పోలీసు స్టేషన్‌కి కూత వేటు దూరంలో జెడ్పీ బాలికోన్నత పాఠశాల దగ్గరలో యువకులు ఘర్షణ పడ్డారు. కొందరు యువకులు మత్తుకు బానిసలై హల్‌చల్ చేస్తుండటంతో ప్రజలు, మహిళలు రోడ్లపై నడవడానికి భయపడుతున్నారు. పోలీసులు మాత్రం రాత్రి వేళల్లో ఎటువంటి పెట్రోలింగ్ నిర్వహించకపోడంతో యువకుల ఆటలు సాగుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ప్రజలు పోలీసుల పనితీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రామ సచివాలయ పరిధిలో డిజిటల్ లైబ్రరీలు

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు

వేటపాలెం: గ్రామస్థాయిలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువకుల కోసం గ్రామ సచివాలయం ఉన్న ప్రతి చోట డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తున్నట్లు గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు పేర్కొన్నారు. స్థానిక వేటపాలెం సారస్వత నికేతనం గ్రంథాలయాన్ని శనివారం సందర్శించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ పోతుల సునీత ఉన్నారు. గ్రంథాలయంలోని పురాతన పుస్తకాలు, దినపత్రికల సంపుటాలను పరిశీలించారు. గ్రంథాలయ చరిత్రను లైబ్రేరియన్లను అడిగి తెలుసుకున్నారు. శేషగిరిరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అట్టడుగు వర్గాలకు గ్రంథాలయ సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. రూ.20 లక్షల నిధులతో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో


పురాతన దినపత్రికలను పరిశీలిస్తున్న శేషగిరిరావు, సునీత

కొన్ని చోట్ల డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు పూర్తియ్యాయన్నారు. ఎమ్మెల్సీ సునీత మాట్లాడుతూ విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేసి పేద బడుగుబలహీన వర్గాలకు ఇంగ్లిష్ మీడియం చదువుకునేలా అవకాశం కల్పించారని తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పనిచేస్తుంటే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురదజల్లుతునానయని విమర్శించారు. చిత్తశుద్ధితో ప్రజాహితం కోసం పని చేస్తోందన్నారు.

పశుపోషకులకు ప్రభుత్వం రాయితీలు

డాక్టర్ హనుమంతరావు

బాపట్ల: పశుపోషకులకు ప్రభుత్వం పలు రాయితీలు అందిస్తోందని జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి మద్దు హనుమంతరావు పేర్కొన్నారు. పశు విజ్ఞాన బడి కార్యక్రమం స్థానిక కొండభొట్లువారిపాలెం రైతు భరోసా కేంద్రంలో శనివారం నిర్వహించారు. డాక్టరు హనుమంతరావు మాట్లాడుతూ రైతులకు లాభాదాయకమైన పథకాలను వివరించారు. పచ్చిగడి విత్తనాలు 75శాతం సబ్సిడీ ద్వారా అందిస్తున్నారని తెలిపారు. గడ్డి కోసే యంత్రాలను 60శాతం సబ్సిడీ ద్వారా అందిస్తుందని తెలిపారు. రైతులు జాతీయ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. పశు కిసాన్ క్రెడిట్‌కార్డుల పథకం ద్వారా పశు పోషణకు అవసరమైన దాణా, పశు ఆరోగ్యం సంరక్షణ, పశుగ్రాస పరిరక్షణ కార్యకలాపాల ఖర్చుల నిమిత్తం ఎటువంటి హామీ లేకుండా గరిష్టంగా


మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ హనుమంతరావు

రూ.1.60లక్షల వరకు రుణాలు ఇస్తామని చెప్పారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి మండల పశువైద్యాధికారి డాక్టరు ఎం.కిరణ్, సిబ్బంది లక్ష్మీ కోటేశ్వరి పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

వివరాలు వెల్లడించిన సీఐ ప్రభాకర్

సంతమాగులూరు(అద్దంకి): హత్య కేసులో నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సంతమాగులూరు సీఐ ప్రభాకర్ అందించిన వివరాలు.. బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం యానాది కాలనీకి చెందిన కోటేశ్వరరావు(20)కు కూలి పనులు చేస్తుంటాడు. రామలింగం ఈనెల 26న పనులకు అడ్వాన్స్‌గా రూ.2 వేలు ఇచ్చాడు. తరువాత ఇద్దరూ కలసి మందు తాగడానికి వెళ్లి ఉదయం 11 గంటలకు కాలనీకి చేరారు. అదే రోజు సాయంత్రం 4 గంటల సమయంలో రామలింగం, కోటేశ్వరారవు ఇంటి వద్దకు వెళ్లి, నీ భర్త ఎక్కడ అని అడిగాడు.. ఆమె నాకు తెలియదని చెప్పడంతో రామలింగం దూషించుకుంటూ వెళ్లిపోయాడు. ఆ తరువాత కొంచెం సేపటికే కోటే


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రభాకర్

శ్వరరావు ఇంటికి చేరాడు. భార్య జరిగినదంతా కోటేశ్వరరావుకు చెప్పింది. వెంటనే కోటేశ్వరరావు రామలింగం ఇంటికి వెళ్లి నా భార్యను ఎందుకు తిట్టావని అడిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కోటేశ్వరరావు నేను నీవద్దకు పనికి రానని చెప్పడంతో రామలింగం కోపోద్రిక్తుడై అడ్వాన్స్ తీసుకుని పనికి రానంటావా అంటూనే పక్కనే ఉన్న వేపకర్ర తీసుకుని కోటేశ్వరరావు తలపై దాడిచేశాడు. బలమైన గాయాలైన కోటేశ్వరరావు అక్కడిక్కడే మృతిచెందడంతో రామలింగం అక్కడి నుంచి ఉడాయించాడు. ఈ ఘటనపై మృతుడి భార్య పోట్లూరి ఏసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి దీక్ష

నరసరావుపేట: ఉద్యోగ భద్రత కల్పిస్తూ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే నెల 7,8 తేదీలలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపనున్నట్లు వీఆర్‌ఏల సంఘం (సీఐటీయు అనుబంధం) జిల్లా అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ వెల్లడించారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో శనివారం వీఆర్‌ఏల సంఘ పల్నాడు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. బందగీ సాహెబ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే దీక్షలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ఆంజనేయులు నాయక్, గుంటూరు మల్లీశ్వరి పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు నైపుణ్యాలపై అవగాహన ఉండాలి



బాపట్ల అర్బన్: పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నైపుణ్యాలపై అవగాహన అవసరమని స్టేట్ సమగ్ర శిక్ష సిమాట్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ ప్రతిష్ఠ అన్నారు. బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రంలో కైవల్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. పల్నాడు, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల నాలుగు జిల్లాల నుంచి ప్రధానోపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు. ఈ నెల 24 ప్రారంభమై 29వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిష్ఠ మాట్లాడుతూ నాయకత్వ బాధ్యతలు, వ్యక్తిగత జాగ్రుతి, సమస్య పరిష్కారాలు, ఎఫెక్టివ్ ప్రధానోపాధ్యాయులుగా పని చేయడంపై అవగాహన కల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో మాస్టర్ ఫెసిలి టేటర్స్, తేజస్విని మిత్రా, మోజేష్ పాల్గొన్నారు.

ఆగస్టులో యూజీనిఎస్-2023 క్విజ్ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: ఆగస్ట్ 28వ తేదీన నిర్వహించనున్న జాతీయ స్థాయి యూజీనిఎస్–2023 క్విజ్ పోటీలకు విద్యార్థులను పంపాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మద్యం కేసులో టీడీపీ నాయకుడి అరెస్ట్

మాచవరం/పిడుగురాళ్ల: అక్రమ మద్యం రవాణా, విక్రయాలను టీడీపీ నేతల యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఇటీవల మండలంలోని చెన్నాయపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నేతలు పలు అక్రమ మద్యం రవాణా, విక్రయ కేసుల్లో అరెస్ట్ కాగా, శనివారం సెబ్ అధికారులు జరిపిన దాడుల్లో మండలంలోని రేగులగడ్డ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అలవాల ఏడుకొండలుతో పాటు అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి కలగాని కనకారావులను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నిల్వ ఉన్న 180 ఎం.ఎల్.పరిమాణం కలిగిన 23 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలవాల ఏడుకొండలు గత స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ


నిందితులను చూపుతున్న సెబ్ అధికారులు

సర్పంచిగా టీడీపీ తరపున పోటీ చేసి ఓడిపోయాడు. ఇప్పుడు తెలంగాణ మద్యం విక్రయిస్తూ సెబ్ అధికారులకు పట్టుబడ్డాడు. అ సందర్భంగా సెబ్ సీఐ కొండారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సరిహద్దుగా ఉన్న ప్రాంతాల నుంచి అక్రమ మద్యం రవాణా జరుగుతుందన్న విశ్వసనీయ సమాచారం దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం రవాణా చేసినా, విక్రయాలు జరిపినా ఎవర్ని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దాడుల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, బీఎంపీపీ ఎస్ఐ బి.దీప్తి కారంత్, సిబ్బంది డి.వెంకటేశ్వరావు, కె.మురళి నాగవర్మ నాగరాజు, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు .